# తాతా నేను తెలుగువాడినేనా!

-డా॥ బి.దామోదరరావు

నీరెండలో వరండాపై వాలుకుర్చీలో కూచుని పేపరు చదువుతున్నాను. నా బట్టతలపై ఎవరో పెన్సిల్‌తో రాస్తున్నట్టు అనిపించి నాలో నేనే నవ్వుకున్నాను. అది శంతన్ పనే...

"ఒరేయ్ శంతన్.. ఇలా రారా, నాకు తెలుసు నీకు నేను మాటిచ్చి మర్చిపోయిన, తెస్తానన్నది తేక పోయినా నువ్విలా చేస్తావని. ఈసారి నీకిచ్చిన మాట తప్పను సరేనా. నీవు ఇట్లా రోజు నా బుర్ర రామకీర్తన పాడిస్తే అది కాస్తా చిల్లులు పడుతుందిరా" అన్నాడు భయం నటిస్తూ.

శంతన్ ముందుకొచ్చాడు. తెరవెనుక నుంచి నటులు వచ్చినట్టుగా- 'గ్రాండ్ పా' అనబోయి తాతయ్య అని తెలుగులో పిలవాలని గుర్తొచ్చి "తాతయ్యా, నీవు నాకిచ్చిన మాట తప్పావు తెలుసా! ఈ హాలిడేస్‌లో మీ విలేజ్ తీసుకెళ్తానన్నావుగా, నీ ప్రామిస్ నిలబెట్టుకోవడం లేదు" అన్నాడు బుంగ మూతితో.

## వర్షాగమనం

అడుగడుగునా ఆకసాన్ని
అడుగుతూనే వున్నా
అంత వైశాల్యాన్నెలా
అదుపులో పెట్టగలిగావని
అన్నిరకాల అగ్నిగుండాలనెలా గ్రీష్మంలో
గుండెల్లో దాచుకోగలిగావని
అయినా కూడా అంత చల్లదనాన్ని ప్రసరించే
అదృష్టాన్నెలా పొందగలిగావనీ
సమాధానం చెప్పడానికి ఆకాశం
సన్నద్ధమైన జాడల్లేవు
చిరు దరహాసాన్ని మాత్రం
చిరుబుర్రులాడకుండా వెల్లడించింది
నిరాశా నిస్పృహల్లో ఆకసాన్ని
నీలిమబ్బులు కమ్ముకున్నవేళ
తొణికితే స్వప్నం చెదురుతుంది
తొలగితేనేమో స్వర్గం చేరువవుతుంది

-రావెల పురుషోత్తమరావు

"సరేలేరా రేపే వెళ్దాం. మరి వదులు బట్టలవీ సర్దుకో" అన్నాడు వాడిలో ఉత్సాహం పెరిగేటట్టుగా.

○ ○ ○

ఊరులో బస్ దిగగానే శంతన్ అడగడం మొదలు పెట్టాడు.

"తాతయ్య అతను ఎవరు?" ఓ డబ్బాలో కూచుని మాంసం నరుకుతున్న అతన్ని చూసి-

"అతనా, కటికవాడు అంటారు. కసాయి అని కూడా అంటారు" అన్నాడు.

"అంటే ఇంగ్లీషులో చెప్పు, నాకు తెలుగు పూర్తిగా రాదుగా" అన్నాడు అక్షరాలు కూడబలుక్కుంటూ.

"అంటే 'బచ్చర్' అంటారు కదరా" అన్నాడు.

"ఓహో! అతనా" అని తెలుగు పదం తెలియ నందుకు విచారపడుతూ మరికాస్త దూరం వెళ్ళేసరికి ఓ రైతు నాగల భుజాన పెట్టుకుని ఎదురయ్యాడు.

"తాతా, తాతా అతన్ని ఏమని పిలుస్తారు? అతని భుజంపై పెట్టుకున్న దానిని ఏమంటారు?" శంతన్ ముద్దుగా అడిగాడు.

అసలు ఈ మాత్రం తెలుగైనా మాట్లాడడం తాను శ్రద్ధగా సెలవుల్లో చెప్పడం వల్లే.

శంతన్‌కు తెలుగంటే ఇష్టమే కానీ వాళ్ళ నాన్న వాడిని ఊటీలో ఉంచి చదివిస్తున్నాడాయే.

మళ్ళీ అడిగాడు శంతన్ "అతను ఎవరు?" వదల డంలేదు. వాడి ఆసక్తి గమనించి చెప్పాడు.

అతన్ని రైతు అంటే 'పీసెంట్' అన్నమాట, అతని భుజంపై ఉన్నది నాగలి అంటే 'ప్లవ్' అంటారు అని విడమరచి చెప్పాడు.

ఇలా మరికొంత దూరం వెళ్ళేసరికి దేవాలయం కనిపించింది. దానిలోకి తీసుకెళ్ళాడు శంతన్‌ను.

"తాతా టెంపుల్‌ను మడి అంటారు కదూ" అన్నాడు ఏదో గుర్తుచేసుకుంటూ.

నాకు నవ్వాగలేదు. బిగ్గరగా నవ్వుతూనే "మడి కాదురా బడవా, గుడి" అన్నాను.

"ఆ.. ఆ... గుడి గుడి" అన్నాడు చిందులేస్తూ.

"మళ్ళీ అతనెవరు?" అన్నాడు పూజారిని చూపిస్తూ.

"అతనా పూజారి, 'ప్రీస్ట్', పూజలు చేసే అయ్య

వారు" అన్నాను.

"ఇంకా మన హౌస్ హౌమెనీ మైల్స్ తాతయ్యా" అన్నాడు.

"ఒరేయ్, నీ ఆలోచలనలు కూలా! ఇదేమన్నా పట్టణమనుకున్నావా మైళ్లు ఉండడానికి? మరో నాలుగడుగుల్లో వచ్చేస్తాం. ఇంకా ఏమైనా తెలుసు కుంటావా, యక్ష ప్రశ్నలు వేస్తావా?"

"తాతయ్య, యక్ష అంటే ఏమిటి?"

మళ్ళీ దానికి అడిగాడు చేతిని గోకుతూ.

అదా, భారతంలో యక్షుడి కథ ఉందిలే, ఇంటికి వెళ్ళాక చెప్తాను.

"భారతమా! అదేమిటి? ఇండియా కదా!" అన్నాడు.

జాలేసింది, ఏమిటీ తరమని. కానీ ఆ పసి మనసుకు ఏమి తెలుసు? దేశ చరిత్రను, సంస్కృతిని ఎలా దాచిపెడ్తున్నామో? వర్ధమాన సమాజం ఎలా వెర్రితలలు వేస్తుందో, ఏది నాగరికత అని చెప్తోందో, ఎటువైపు వెళ్తుందో అనుకుంటూ నిట్టూర్చాడు.

కొద్ది దూరం వెళ్ళగానే పెద్ద మేడ, విశాలమైన ఆవరణ. ఇంటి వెనుక పెద్ద తోట. ఎంత అందంగా, పొందికగా ఉంది ఇల్లు. ఆ ఇంట్లో వాళ్ళ నాయనమ్మ పనివాళ్ళకు ఏదో చెప్తూ హడావుడిగా కనిపించింది.

"హాయ్, గ్రాండ్ మా" అరిచాడు శంతన్.

"ఒరేయ్, నువ్వట్రా. నాయనమ్మ అను, లేకపోతే మీ తాతయ్య కొడతాడు" అంది నవ్వుతూ.

❍ ❍ ❍

"ఒరేయ్ శంతన్, ఇదిగో ఇది తిను" అంటూ తినుబండారాలు తెచ్చి శంతన్ దగ్గర పెట్టింది సుందరమ్మ ఆప్యాయంగా.

"ఇవేమిటి నాయనమ్మా బ్లాక్‌గా ఉన్నాయి. పైన వైట్ స్పాట్స్ ఏమిటి?" అని వాటిని చేత్తో అటూ ఇటూ తిప్పుతూ అడిగాడు.

చెప్పమన్నట్టు చూసింది సుందరమ్మ భర్తవైపు–

"అవా, అరిసెలు అంటారు. పిండిలో అంటే ఫ్లోర్‌లో బెల్లం అంటే గూడ్ కలిపి చేస్తారు. పైన స్పాట్స్ అన్నావే అవి గసగసాలు. ఇంగ్లీషులో ఏం అంటారో తెలిసి చావడంలేదు గసగస్సాస్" అన్నాడు.

సుందరమ్మకు నవ్వు ఆగలేదు ఈ కల్పనకు.

మరికాసేపటికి మరో కంచంలో మరికొన్ని తినుబండారాలు తెచ్చి శంతన్ ముందు పెట్టింది. పక్కనే కూచుని కొసరి కొసరి తినిపించింది.

శంతన్‌కు ఏనుగు ఎక్కినంత సంతోషంగా ఉంది. నాయనమ్మ దగ్గరగా చేరి, "మమ్మీ ఇవి చేయదెందుకు, ఇవేమిటి" అని అడిగాడు.

ఇదా, కారప్పూస, బూందిలడ్డు, చక్కిలాలు, చెగోడీలు అంది.

పిజ్జాలు, బర్గర్లకు అలవాటుపడ్డ, చాక్లెట్లు, బిస్కెట్లు తిన్న చిన్నారి లోకానికి ఇవి వింత వస్తువులే మరి.

శంతన్ వాటివైపు ఆశ్చర్యంగా చూస్తూ, నోట్లో వేసుకుని వెరీ ఫైన్, వెరీ స్వీట్, వెరీ హాట్ అన్నాడు.

"ఈ ఊర్లో హోటల్ ఉందా? అక్కడ్నుంచి తెచ్చారా నాయనమ్మా?" అని అన్నాడు.

"లేదురా, నీ కోసం ఈ నాయనమ్మ స్వయంగా చేసింది. బావున్నాయా?" అని అడిగింది.

"ఔనా, నాయనమ్మ ఇవన్నీ నాకేనా! అవును కానీ నాకు తెలుగు రైమ్స్ నేర్పవూ" అడిగాడు ముద్దుగా.

"రైమ్స్ అంటే?" ఆశ్చర్యంగా అడిగింది సుంద రమ్మ.

రైమ్స్ అంటే మరేం లేవు చిన్నారి పాటలు, మన సుమతీ, వేమన పద్యాల్లాంటివి కావు అవి. ఆనందం కోసం పాడుకునేవి.

❍ ❍ ❍

సాయంత్రం శంతన్‌కు ఊరంతా చూపించాను.

ఓ వైపు కోలాటాలు, చెక్కభజనలు, దేవుని ఊరేగింపు, మర్నాడు పక్క ఊర్లో జాతర, పచ్చని పొలాలు, కబడ్డీ, చిర్రగోనే ఆటలు ఎంత చక్కగా ఉంది తెలుగు సీమ. అడుగడుగునా ఆప్యాయత కురిపిస్తూ, ఊర్లో వాళ్ళ పలకరింపులు.

తెల్లారితే ఊరు వదులుతాననగా దుఃఖం పొర్లి వచ్చింది శంతన్‌కు. రాత్రే నాన్న సెల్‌లో ఆజ్ఞాపిం చాడు, సెలవులు ముగుస్తున్నాయి. ఊటీ వెళ్ళాలి త్వరగా రమ్మని. కానీ నాయనమ్మ ప్రేమ, తాతయ్య లాలన, ఊరి మురిపాలు అక్కడ దొరుకుతాయా. తెలుగులో ఎంత మాధుర్యం ఉంది. నాయనమ్మ పాటల్లో ఎంత తీయదనం ఉంది, తాతయ్య చెప్పే కథల్లో ఎంత నీతి ఉంది. అసలు ఈ నాలుగు రోజుల్లోనే తెలుగుదనం ఎంతగా అబ్బింది. ఇంకా ఓ సంవత్సరం ఉంటే...

తెల్లారాక తయారయ్యాక అడిగాడు తాతయ్యను, "తాతా– నాకు తెలుగు వచ్చింది కదా, మరి నేను తెలుగువాడినేనా?" అని. ■